
సాక్షి
ఒడిశా

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,09,932లు, బంగారం 3గ్రాములు 100 మిల్లీగ్రాములు, వెండి 62గ్రాములు 600 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పద్మపూర్‌ను ఎన్‌ఏసీగా గుర్తించాలి

రాయగడ జిల్లాలోని పద్మపూర్‌ను ప్రభుత్వం ఎన్‌ఏసీగా గుర్తించాలని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక డిమాండ్ చేశారు.

- 8లో▸



రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు గాయాలు

రాయగడ జిల్లాలోని పద్మపూర్ సమీపంలో ధమన్‌జొడి నుంచి జాజ్‌పూర్‌కు కారులో వెళ్తున్న దంపతులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.

- 8లో▸

న్యూస్‌రీల్

28న రాష్ట్రంలో బిల్‌గేట్స్ పర్యటన

భువనేశ్వర్: మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఈనెల 28న రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. దీనిలో భాగంగా భువనేశ్వర్‌లోని కృషి భవన్‌ను సందర్శించి అనంతరం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను కలుస్తారని భావిస్తున్నారు. ఈ మేరకు బిల్ గేట్స్ తన బ్లాగ్ 'గేట్ నోట్స్'లో పర్యటన కోసం తన నిరీక్షణను వ్యక్తం చేశాడు. తన పర్యటనలో భారతదేశం డీపీఐ చర్యను చూస్తానని పేర్కొన్నారు. ఒడిశా రాష్ట్రంలోని వ్యవసాయ పర్యవేక్షణ కేంద్రాన్ని సందర్శించనున్నట్లు తెలియజేశారు.

రోడ్లు, వంతెనల నిర్మాణాలకు శంకుస్థాపన



నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: సమితిలోని పలు రహదారులు, మూడు వంతెనల నిర్మాణాలకు ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి సోమవారం శంకుస్థాపన చేశారు. కొరాపుట్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా చేపట్టనున్న ఆ పనులకు జయపురం సమితి ప్రాంగణంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అభివృద్ధి పనుల వలన పలు గ్రామాల రాకపోకలకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్డీ దేవాసిస్ మండల్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మొసలి పట్టివేత



వలలో చిక్కిన భారీ మొసలి

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి పూసుగూడ పంచాయతీ ఎంపీవీ 55 గ్రామ సమీపంలోని చెరువులో ఒక భారీ మొసలిని స్థానికులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన సంజయ్ పోజిదార్, భవేన్ మండాల్‌లు కలిసి చేపలు కోసం వల వేశారు. అయితే వలలో చేపలకు బదులు మొసలి చిక్కింది. దీంతో మొసలిని తాళ్లతో కట్టివేసి కలిమెల అటవీ శాఖకు సమాచారం అందజేశారు. అధికారులు మొసలిని స్వాధీనం చేసుకొని, చిత్రకొండ జలాశయంలో విడిచిపెడతామని తెలియజేశారు.

అంబులెన్స్ ఢీకొని వృద్ధుడికి గాయాలు



గాయపడిన బిభీషణ నాయిక్

జయపురం: అంబులెన్స్ ఢీకొనడంతో వృద్ధుడు తీవ్రంగా గాయపడిన ఘటన జయపురంలో సోమవారం చోటుచేసుకుంది. గాయపడిన వ్యక్తి జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి మఠపడ గ్రామ పంచాయతీ నువాగుడ గ్రామానికి చెందిన బిభీషణ నాయిక్(60)గా గుర్తించారు. గ్రామానికి పెద్ద అయినటువంటి బిభీషణ నాయిక్ ఒక సమస్యను పరిష్కరించేందుకు ఆదివారం సైకిల్‌పై కొటియగుడ గ్రామానికి వెళ్లాడు. అనంతరం సాయంత్రం 7 గంటలకు తన గ్రామానికి తిరిగి వస్తుండగా బాలిగాం ఆస్పత్రి నుంచి ఒక రోగిని తీసుకెళ్తున్న అంబులెన్స్ ఢీకొంది. దీంతో సైకిల్‌తో పాటు బిభీషన్ కిందపడ్డాడు. ప్రమాదంలో అతడి చాతికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో విచ్చలవిడిగా అవినీతి



కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట



బారికేడ్లు దాటేందుకు ప్రయత్నిస్తున్న ఓపీసీసీ చీఫ్ శరత్ పట్నాయక్

- బీజేపీతో కుమ్మక్కై కుటిల రాజకీయాలు
- రాష్ట్రంలో అఘాయిత్యాలు పెరిగాయి
- బీజేడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు
- సచివాలయం ముట్టడికి యత్నం

భువనేశ్వర్:

గనులు, విద్యుత్, ఆరోగ్యం, విద్యా రంగాల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని ఆరోపిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ సోమవారం భారీ ఎత్తున ఆందోళన చేపట్టింది. స్థానిక కాంగ్రెస్ భవన్ నుంచి ర్యాలీ చేపట్టింది. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టర్ అజోయ్ కుమార్ నేతృత్వంలో స్థానిక దిగువ పీఎంజీ కూడలి వరకు ఊరేగింపు కొనసాగింది. రాష్ట్రంలో బిజూ జనతా దళ్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపిస్తూ స్థానిక రాష్ట్ర సచివాలయం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించి ముట్టడించేందుకు విఫలయత్నం చేశారు. అనేక మంది కాంగ్రెస్ కార్యకర్తలు లోకోసేవ భవన్ వైపు దూసుకుపోయారు. ఆ ప్రాంతంలో మోహరించిన పోలీసు సిబ్బంది నిరసనకారులను అడ్డుకోవడంతో దిగువ పీఎంజీ కూడలి యుద్ధ రంగంగా మారింది.

24 ఏళ్లుగా దుష్పరిపాలన

గత 24 ఏళ్లలో రాష్ట్రంలో బిజూ జనతా దళ్ (బీజేడీ) ప్రభుత్వం దుష్పరిపాలనకు పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి పెచ్చుమీరి నిరుద్యోగ సమస్య తాండవిస్తుందన్నారు. మహిళలు, బలహీనవర్గాలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు నిత్య కృత్యాలుగా పరిణమించాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు తీరని అన్యాయం జరుగుతోందని నినాదాలు చేస్తూ కాంగ్రెస్ నిరసనకారులు ఊరేగింపు నిర్వహించారు. నిరసనకారులు రాష్ట్ర సచివాలయం వైపు వెళ్లే ప్రయత్నంలో భద్రతా వలయాన్ని విచ్ఛిన్నం చేస్తున్నప్పుడు పోలీసు సిబ్బందితో ఘర్షణకు దిగారు. ఈ సందర్భంగా నవీన్ పట్నాయక్ ప్రభుత్వంపై పీసీసీ చీఫ్ శరత్ పట్నాయక్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. నవీన్ సర్కారు అక్రమాలకు పాల్పడి రాష్ట్రాన్ని నాశనం చేసేందుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ)తో కుమ్మక్కైందని ఆరోపించారు. బీజేడీని రాష్ట్ర ప్రజలు గద్దె దించుతారని తొడగొట్టారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు బీజేడీ, బీజేపీ రెండు పార్టీలపై కాంగ్రెస్ పోరాటాన్ని ఉధృతం చేస్తుందన్నారు.

ఉపాధి కల్పించడంలో విఫలం

అదే తరహాలో జయపురం నియోజకవర్గం పార్టీ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి మాట్లాడుతూ బీజేడీ ప్రభుత్వం ఉపాధి కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. ఒకే జిల్లా నుంచి 15 లక్షల మందికిపైగా నిరుద్యోగులు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని బీజేడీ పాలన, కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజలను నిలువెత్తున దగా చేస్తున్నాయని ఆరోపించారు. రైతులు తమ ఉత్పత్తులను లాభదాయకమైన ధరలకు అమ్ముకోలేక నష్టాల విక్రయానికి బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేడీ ప్రభుత్వ నిరంకుశాన్ని సహించబోమని, కాంగ్రెస్ తన ఆందోళనను మరింత ఉధృతం చేస్తుందని కటక్ బరాబటి నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ మొకీం హెచ్చరించారు. బీజేడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టడానికి ముందు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర రాజధానిలోని కాంగ్రెస్ భవన్‌కు తరలి వచ్చారు.



పీఎంజీ కూడలిలో కాంగ్రెస్ కార్యకర్తలు

వినూత్న రీతిలో కాంగ్రెస్ ప్రచారం



బీజేపీ, బీజేడీ గుర్తులతో తయారుచేసిన శుభలేఖ



పీఎం మోదీ, సీఎం నవీన్ మాస్కులతో ఉన్న వ్యక్తులకు పెళ్లి జరిపిస్తున్న దృశ్యం

జయపురం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో అవిభక్త కొరాపుట్‌లో కాంగ్రెస్ పార్టీ వినూత్న రీతిలో ప్రచారం చేపడుతోంది. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలోని బీజేడీ పార్టీలకు పెళ్లిల్లు నిర్వహిస్తూ ఆ రెండు పార్టీలు ఒక్కటేనని ప్రజలకు తెలుపుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం నవీన్ పట్నాయక్ మాస్కులతో ఉన్నటువంటి ఇద్దరికి కొరాపుట్, లక్ష్మీపూర్ మొదలగు ప్రాంతాల్లో కాంగ్రెస్ శ్రేణులు పెళ్లిళ్లు చేశారు. అదేవిధంగా నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్‌లోనూ పెళ్లి చేశారు. కేంద్రంలో ఉన్నటువంటి మోదీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతోందని దుమ్మెత్తిపోశారు. రానున్న ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు పొత్తుతో వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

ప్రజా ప్రతినిధులపై కేసుల పరిష్కారానికి చర్యలు

భువనేశ్వర్: రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారానికి ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ధారిత గడువులోగా ఈ మేరకు సమగ్ర నివేదిక దాఖలు చేయాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. లోగడ సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల కార్యాచరణ పురస్కరించుకుని రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆదేశాలను పాటించడంలో విఫలమైన నేపథ్యంలో ఒరిస్సా హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పలు న్యాయస్థానాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేల వ్యతిరేకంగా పెండింగ్‌లో ఉన్న కేసుల తాజా స్థితిగతుల సమగ్ర సమాచారం దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ఏడాది జనవరి 11న ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల ఆచరణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టు 4 వారాల గడువు కల్పించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చక్రధారి శరణ్ సింగ్, జస్టిస్ సంగమ్ కుమార్ సాహుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. జిల్లా న్యాయమూర్తుల నుంచి దాఖలైన పరిశీలన నివేదికల ప్రకారం రాష్ట్రంలో ఎంపీలు, ఎమ్మెల్యేల వ్యతిరేకంగా 435 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నెలలో తాజాగా నమోదైన 20 కేసుల్లో 8 కేసులను పరిష్కరించారు.

తుది విచారణకు 69 కేసులు

మొత్తం కేసుల్లో 69 మాత్రమే తుది విచారణ దశకు చేరుకున్నాయి. ఖుర్దా జిల్లాలో మొత్తం 86 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. తదుపరి స్థానంలో సంబల్‌పూర్ (55), కొరాపుట్ (51), గంజాం (50), సుందర్‌గఢ్ (41), కటక్ (36) పెండింగ్‌లో ఉన్నాయి. కొరాపుట్ జిల్లాలో 1991లో నమోదైన కేసులు పెండింగ్‌లో ఉండగా, ఖుర్దా మరియు సుందర్‌గఢ్ జిల్లాల్లో 1998 నాటి కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది జనవరిలో నయాగఢ్ (5), సంబల్‌పూర్ (6), కొరాపుట్ (3), కెంజొహర్ (4), ఢెంకనాల్ (1), కటక్ (1) జిల్లాల్లో కేసులు నమోదు చేయబడ్డాయి. సంబల్‌పూర్ జిల్లాలో నాలుగు, బాలాసోర్, బొలంగీర్, కటక్, గంజాం జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున పరిష్కరించబడ్డాయి. గతేడాది డిసెంబర్ 11న సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర హైకోర్టు స్వయంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సవివరంగా దాఖలు చేయాలని న్యాయమూర్తులను ఆదేశించింది. అనంతరం జిల్లా, సెషన్స్ జడ్జిలు తమ పరిధిలోని నిర్దేశిత న్యాయస్థానాల ద్వారా ఎంపీలు, ఎమ్మెల్యేల వ్యతిరేకంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని హైకోర్టు ఆదేశించింది.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

రాయగడ:

అంతర్జాయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు సోమవారం నిర్వహించారు. స్థానిక అటానమస్ కళాశాల ప్రాంగణంలో జరిగిన పోటీల్లో భాగంగా ఆధునిక సమాజంలో మహిళ పాత్ర అన్న అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అదేవిధంగా చిత్రలేఖనం పోటీలను కూడా నిర్వహించారు. జగదీష్ చంద్రదొర, భువనేశ్వరి పాత్రో, రాజ్యలక్ష్మి దేవి, అనితా త్రిపాఠి, దీపిక పట్నాయక్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. క్లబ్ అధ్యక్షురాలు కె.రంజిత అధ్వర్యంలో జరిగిన పోటీల్లో గెలిపొందిన విజేతలకు మార్చి 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో బహుమతులు అందజేస్తారు.



పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని

సార్వత్రిక ఎన్నికల సన్నద్ధం

- రాష్ట్ర సీఈవో నికుంజ బిహారీ ధొలా

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. ఎన్నికల సంఘం యంత్రాంగం క్షేత్రస్థాయి నుంచి ఈ ఏర్పాట్లు తరచూ సమీక్షిస్తోంది. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ కోసం నిరీక్షిస్తున్న తరుణంలో రాష్ట్ర శాసన సభ, లోక్‌సభ జంట ఎన్నికల దృష్ట్యా జిల్లాస్థాయి సన్నాహాలపై ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) నికుంజ బిహారీ ధొలా సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌లు (ఏడీఎం) తమ జిల్లాల్లో ఎన్నికల సన్నాహాల్లోని వివిధ అంశాలపై సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ఏర్పాట్లతో పాటు వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు.

పారదర్శకతకు పెద్దపీట

ఎన్నికల సమయంలో పారదర్శకంగా ఉండేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని నికుంజ బిహారీ ధొలా ఏడీఎంలను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్లు అత్యంత కీలకమన్నారు. ఓటర్ల ను దష్టిలో ఉంచుకుని అన్ని సన్నాహాలు చేయా లని అధికారులను ఆదేశించారు. సాంకేతికతపై అనుబంధ యంత్రాంగానికి శిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1950 అన్నివేళలా పనిచేయాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ల ముద్రణ ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమీక్ష సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎస్.తిరుమల నాయక్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి పర్యటనకు భద్రత కట్టుదిట్టం

- డీసీపీ ప్రతీక్ సింగ్

భువనేశ్వర్:

ఈనెల 28వ తేదీ నుంచి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 4 రోజుల రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రపతి తన పర్యటనలో భువనేశ్వర్‌తో పాటు, కటక్, మయూర్‌భంజ్, కెంజొహర్, సంబల్‌పూర్, బరంపురం సందర్శించనున్నారు. దీంతో రాజధాని నగరం భువనేశ్వర్‌లో 30 ప్లాటూన్ల పోలీసు బలగాలు మోహరిస్తారని నగర డీసీపీ ప్రతీక్ సింగ్ తెలిపారు. 12 మంది అదనపు డీసీపీలు, 25 మంది ఏసీపీలు, 40 మంది పోలీసు ఇన్‌స్పెక్టర్లు సహా 85 మంది అధికారులు పర్యవేక్షిస్తారని వెల్లడించారు.

రాష్ట్రపతి పర్యటన కోసం భద్రతా ఏర్పాట్లలో 3 క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, 2 స్పెషల్ టాక్టికల్ యూనిట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. బ్లూ బుక్ ఆధారంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. రూట్ లైన్ నుంచి కార్కేడ్లు, ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. బ్లూ బుక్ మార్గదర్శకాల ప్రకారం రాజధాని నగరం మొత్తం పటిష్ట పోలీసు క్యాంపుగా మారుతుంది. రాష్ట్రపతి కాన్వాయ్ సజావుగా వెళ్లేందుకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, సామాన్య ప్రజల సౌకర్యార్థం చర్యలు తీసుకుంటామని డీసీపీ పేర్కొన్నారు.



ఏర్పాట్లు పరిశీలన

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 4 రోజుల రాష్ట్ర పర్యటనకు ముందు భారత వైమానిక దళ అధికారులు మయూర్‌భంజ్‌లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె రెండు రోజుల పాటు మయూర్‌భంజ్ జిల్లాలో ఉంటారు. 2022 సంవత్సరం జూలై నెలలో రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆమె తన సొంత జిల్లా పర్యటన ఇది మూడోసారి కావడం విశేషం. వైమానిక దళ అధికారులు ప్రత్యేక విమానంలో పాండురుశిల్ గ్రామంలోని హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఢిల్లీకి తిరిగి వెళ్లడానికి ముందు ఖిచింగ్, సుక్రులి వద్ద భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో చర్చించారు. ఈనెల 28, 29 తేదీల్లో రాష్ట్రపతి మయూర్‌భంజ్‌లో ఉంటారు. ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నారు. సకాలంలో అన్నీ సిద్ధమవుతాయని రాయ్‌రంగ్‌పూర్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (ఏడీఎం) దౌలత్ చంద్ర కొరా తెలిపారు. పర్యటనలో భాగంగా ఆమె స్వస్థలమైన రాయరంగ్‌పూర్‌లో అనేక ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేస్తారు. ఆమె సీపీడబ్ల్యూడీ హాలిడే హోమ్, కొన్ని హైవే ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన చేస్తారు.

ఆకట్టుకున్న డాగ్ షో

పర్లాకిమిడి:

స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో గజజ్యోతి వెటర్నరీ ఫెస్టివల్‌లో భాగంగా వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు డాగ్ షోను సోమవారం ప్రారంభించారు. డాగ్ షోలో గోల్డెన్ రిట్రీవర్, లాబ్రడర్, సెయింట్ బెర్నార్డ్, పోమేరియన్, కేన్ కర్సో, బాక్సర్, బీగెల్, బుల్ మస్తిఫ్, జర్మన్ షెఫార్డ్ వంటి జాతి కుక్కలు పోటీలు పాల్గొన్నాయి. వివిధ జిల్లాల నుండి 35 బ్రీడ్ డాగ్స్ పోటీలో పాల్గొనగా వాటిలో ఉత్తమ బ్రీడ్ డాగ్‌లకు ప్రథమ, ద్వితయ, తృతీయ బహుమతులు అందజేశారు. వర్సిటీ వెటర్నరీ స్కూల్, యానిమల్ సైన్సెస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రొ.ఆర్.కె.స్వయిని, డైరెక్టర్ (అడ్మిన్) డా.దుర్గాప్రసాద్ పాఢి పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఒడిశా కెన్నల్ క్లబ్ అధ్యక్షుడు సుబ్రత్ పృష్టి, వెటర్నరీ డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఎం.జీ. జయంత్ నాగరాజ్, ఫార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ డా.బిమల్ కుమార్ చౌదరి వ్యవహరించారు.



డాగ్ షో పోటీలకు విచ్చేసిన వివిధ జాతుల కుక్కలు



డాగ్ షో ప్రారంభిస్తున్న డీఎస్ రావు దంపతులు



డాగ్ షో ప్రథమ విజేత లాబ్రడార్‌తో యజమానులు

క్లుప్తంగా

సామాన్యుడికి అందుబాటులో రైలు టికెట్ ధరలు

ఆమదాలవలస: సామాన్యులకు అందుబాటులో ఉండేలా పాసింజరు రైలు టికెట్ ధరలు తగ్గించినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ నుంచి విశాఖ, అటు పలాసకు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. డీఎంయూ రైలు (08531) పలాస -విశాఖపట్టణం, ఈఎంయూ రైలు (07470) పలాస- విశాఖపట్టణంకు టికెట్ ధరలు తగ్గించారు. శ్రీకాకుళం నుంచి విశాఖకు గతంలో టికెట్ ధర రూ.60 ఉండేది. అది ప్రస్తుతం రూ. 30లు చేశారు. అలాగే శ్రీకాకుళం నుంచి పలాసకు రూ. 40 సాధారణ టికెట్ ఉండేది. ప్రస్తుతం అది రూ. 20గా తగ్గిస్తూ ప్రకటించారు.

97శాతం పనులు పూర్తి


హిరమండలం వంశధార రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ, క్వాలిటీ కంట్రోల్ అధికారులు

హిరమండలం: వంశధార ఫేజ్-2 రిజర్వాయర్ పనులు 97 శాతం పూర్తయినట్టు ఎస్ఈ డోల తిరుమలరావు తెలిపారు. రిజర్వాయర్‌ను త్వరలో జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఆయన సోమవారం రిజర్వాయర్ నిర్మాణ పనులను వంశధార ఇంజినీర్ అధికారులతో కలిసి పరిశీలించారు. స్పిల్ వేతో పాటు తులగాం గెడ్డ వద్ద జరుగుతున్న పెండింగ్ పనుల గురించి ఆరా తీశారు. వీటితో పాటు ఎత్తిపోతల పథకం, హైలెవల్ కాలువ అనుసంధాన పనులను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి ఎస్ఈ కీలక సూచనలు ఇచ్చారు. ఎస్ఈ తిరుమలరావు మాట్లాడుతూ దాదాపు రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. అటు కాంట్రాక్టర్‌కు ఎలాంటి బిల్లులు పెండింగ్‌లో లేవని తెలిపారు. ఈ ఖరీఫ్‌నకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రెండు నెలల్లో రిజర్వాయర్ ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. నేరడి బ్యారేజీలో నెలకొన్న సందిగ్ధతతోనే రూ.176.5 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ త్రినాథరావు, డీఈ ప్రభాకరరావు, వంశధార కట్టడాల విభాగం ఈఈ ఎస్వీ రమణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. డీఈలు రవీంద్ర, సురేష్ బాబు, జేఈలు వినయ్, భరత్ రెడ్డి, శ్రీనివాసరావు, సోమ నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పందనకు 178వినతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 178 వినతులు అందాయి. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీ, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అర్జీలు స్వీకరించారు. వినతులన్నీ నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో కేఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ దొరబాబు, జెడ్పీ సీఈఓ డి.వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టి రాజు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, హౌసింగ్ పీడీ గణపతి రావు, ఇరిగేషన్ ఎస్ఈ డోల తిరుమల రావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: భూ వివాదాలకు సంబంధించి వేర్వేరు కేసుల్లో ఇద్దరికి సోమవారం న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. హిరమండలం మండలం గులుమూరు పంచాయతీ జగన్నాధపురం గ్రామానికి చెందిన తోట నాగరాజుకి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానాను విధించారు. జరిమానా కట్టని ఎడల శిక్షను మరో మూడు నెలలు అనుభవించాల్సి ఉంటుందని నాల్గో అదనపు జిల్లా న్యాయస్థానం (ఎస్సీ, ఎస్టీ) కోర్టు న్యాయమూర్తి ఎస్ఎం ఫణికుమార్ తీర్పునిచ్చారు. 2015లో భూమి ఆక్రమణతో పాటు దాడికి సంబంధించి ఈ శిక్ష పడింది. అలాగే హిరమండలం మండలం గులుమూరు గ్రామానికి చెందిన గోర్ల చంద్రయ్యకు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. రూ.10వేలు జరిమానా, కట్టకుంటే మరో రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పొలాన్ని ఆక్రమించి కులం పేరిట దూషించినందుకు ఈ శిక్ష పడింది.

చివరి దశకు డిగ్రీ మూడో సెమిస్టర్ స్పాట్ వాల్యుయేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మూడో సెమిస్టర్ జవాబు పత్రాలు స్పాట్ వాల్యుయేషన్ చివరి దశకు చేరుకుంది. ఆరు కేంద్రాల్లో ఈ మూల్యాంకనం కొనసాగుతుంది. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం రూరల్ లోని గాయత్రి ప్రైవేట్ డిగ్రీ కళాశాల, రాజాం లోని జీసీ ఎస్ఆర్ ప్రైవేట్ డిగ్రీ కళాశాల శిబిరాల్లో మూల్యాంకనం ముగిసింది. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాలలో కొనసాగుతోంది. ఇది ముగియగానే ఫలితాలు విడుద ల చేస్తామని ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. రెగ్యులర్‌గా 6922, సప్లిమెంటరీగా 4250 మంది పరీక్ష రాసినట్లు తెలిపారు.

పద్మపూర్‌ను ఎస్‌సీగా గుర్తించాలి


మాట్లాడుతున్న సప్తగిరి, పక్కనే దుర్గాపండ తదితరులు

- కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక డిమాండ్

రాయగడ: జిల్లాలోని పద్మపూర్‌ను ప్రభుత్వం ఎస్‌ఏసీగా గుర్తించాలని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా ఎక్కువగా ఉన్నటువంటి పద్మపూర్ అభివృద్ధి బాటలో పయనించాలంటే ఎస్‌ఏసీ గుర్తింపు అనివార్యమన్నారు. దీనికోసం కొన్నేళ్లుగా ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పటికీ, ఇటీవల ప్రకటించిన ఎస్‌ఏసీ జాబితాలో పద్మపూర్ లేకపోవడం విచారకరమన్నారు. అలాగే కాసీపూర్ సమితి పరిధిలోని జొడియా తెగలను ఆదివాసీలుగా గుర్తించి, వారిని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. లోక్‌సభ సమావేశాల్లో తాను ఇదే విషయమై ఎన్నో సార్లు ప్రస్తావన చేసినప్పటికీ జొడియా తెగలను విస్మరించడం సమంజసం కాదన్నారు. ఆదివాసీ గుర్తింపు లేకపోవడంతో ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అందుకోలేపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కొరాపుట్ నుంచే పోటీ

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి తాను తప్పకుండా పోటీ చేస్తానని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. టిక్కెట్టు కోసం ఎంతమంది పైరవీలు చేసినా అధిష్టానం తనకే టిక్కెట్టు కేటాయిస్తుందనే నమ్మకంతో ఇప్పటికే ప్రచారం ప్రారంభించానని వెల్లడించారు. కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు 12 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేశారని, వారిలో తన తమ్ముడు కూడా ఉన్నారన్న స్పష్టం చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం తథ్యం

త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం తథ్యమని సప్తగిరి అన్నారు. రెండు దశాబ్దాలకు పైగా అధికారంలో ఉన్నటువంటి బీజేడీపై ప్రజలు విరక్తితో ఉన్నారన్నారు. అధికారం చేపట్టేందుకు సరిపడా సీట్లు ఈసారి గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. తన తండ్రి రాష్ట్ర మాజీ మంత్రి రామచంద్ర ఉలక ఈ జిల్లాకు, రాష్ట్రానికి చేసిన సేవలే తనను గెలిపిస్తాయని పేర్కొన్నారు. ప్రతీ ప్రాంతంలో ఆదివాసీల అభ్యున్నతి, విద్యా వికాసానికి ఆయన చేసిన సేవలు అపారమన్నారు. సమావేశంలో పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ, సునీల్ పండ, అస్లామ్ ఖాన్, అప్పల స్వామి కద్రక, పార్టీ సీనియర్ నాయకుడు చిన్నారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి చర్యలు


పర్లాకిమిడి: కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ చంద్రశేఖర సాహు తదితరులు

- అమృత్ భారత్ స్టేషన్ యోజనకు పీఎం మోదీ శంకుస్థాపన

రాయగడ: అమృత్ భారత్ స్టేషన్ యోజన కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 554 రైల్వే స్టేషన్లు, 1500 ఆర్‌వోబీల అభివృద్ధి పనులకు పీఎం నరేంద్ర మోదీ సోమవారం శంకుస్థాపన చేశారు. దీనిలో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, ఎస్పీ హరీష్ బిసి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, బసంత కుమార్ ఉలక, కాశీరాం మాఝి తదితరులు పాల్గొన్నారు.


రాయగడ: కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సప్తగిరి తదితరులు

జయపురం: అమృత్ భారత్ పథకం కింద స్థానిక రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్ మాట్లాడుతూ.. జయపురం రైల్వే స్టేషన్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. స్టేషన్‌కు ఒక ప్రవేశ మార్గంతో పాటు ఒక వెళ్లే మార్గం ఏర్పాటు, అలాగే క్యాంటిన్, సౌచాలయం, విశ్రాంత గదులు, దివ్యాంగులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు.


జయపురం: మాట్లాడుతున్న బీజేపీ నేత గౌతమ సామంతరాయ్

పర్లాకిమిడి: అమృత్ భారత్ స్టేషన్ యోజన పథకం కార్యక్రమాన్ని పర్లాకిమిడి రైల్వేస్టేషన్ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి బరంపురం ఎంపీ చంద్రశేఖర సాహు, ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు, ఈస్టుకోస్టు రైల్వే డివిజనల్ మెకానికల్ ఇంజినీరు రుద్రరంజన్ మిశ్రా, శ్రీకాకుళం రైల్వే ఇంజినీర్ బీవీఎస్ మూర్తి, డీఈఈ అబనేందు రాయ్ తదితరులు పాల్గొన్నారు.

వెంటాడిన మృత్యువు

యలమంచిలి: సకాలంలో డ్యూటీలో చేరేందుకు వెళ్తున్న ఓ యువ ఇంజినీర్‌ను మృత్యువు వెంటాడింది. ఉపాధి నిమిత్తం ఒడిశాకు చెందిన తరాయి జగన్నాథం (26) తెలంగాణాలో మునగాడకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, సోమవారం ఉదయం యలమంచిలి మండలం పురుషోత్తపురం హైవే జంక్షన్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా రంభ గ్రామానికి చెందిన అతడు సివిల్ ఇంజినీర్‌గా మునగాడ వద్ద కేపీసీ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇటీవల తన స్వగ్రామం వచ్చి తిరిగి డ్యూటీలో చేరేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదానికి గురైనట్టు యలమంచిలి రూరల్ ఎస్సై పి.సింహాచలం తెలిపారు. మృతదేహాన్ని యలమంచిలి మార్చురీలో భద్రపరిచామని, మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కరపత్రం ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఆర్థిక అక్షరాస్యత వారం నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, బ్యానర్లను కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌లు సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ, డీఆర్‌డీఏ పీడీ, ఎల్‌డీఎం, ఇతర బ్యాంకు అధికారులు ఉన్నారు.

మార్చి 3న పల్స్ పోలియో

శ్రీకాకుళం పాతబస్టాండ్: మార్చి 3వ తేదీన పల్స్ పోలియో నిర్వహించనున్నామని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 3న, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే 4, 5 తేదీల్లో కూడా వేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి సందేశం చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.

1,79,984 మంది ఐదేళ్ల లోపు పిల్లలకు 1232 పోలియో బూత్‌లు, 50 ట్రాన్సిట్ బూతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 78 మొబైల్ టీమ్‌లు, 121 సూపర్‌వైజర్ బృందాలుగా ఏర్పడి 3,12,000 డోసులు వేయడానికి ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. మొబైల్ టీమ్‌లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అన్ని సంచార జాతుల వారి పిల్లలకు, ఇటుక బట్టీలు నిర్వహించే వారి పిల్లలకు, నిర్మాణ స్థలాలు, ఫిషరీస్ ప్రదేశాల్లో పోలియో చుక్కలు వేస్తారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి ఈశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విద్యా సాగర్, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, రవాణా, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమృత్ భారత్‌తో స్టేషన్ల అభివృద్ధి

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల పథకాన్ని సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఊసవానిపేట వద్ద రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.66.5కోట్లు, స్టేషన్ ఆధునీకీకరణకు రూ. 25 కోట్లు, దూసి వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.70కోట్లు, నౌపడ స్టేషన్ అభివృద్ధికి రూ.19కోట్లు, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ. 18 కోట్లు మంజూరు చేశారు. దీనికి సంబంధించిన పనులకు వర్చువల్‌గా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ ఆవరణలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్పీకర్ పాల్గొని మాట్లాడారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద పలు రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాలు పెంచడం ఆనందదాయకమన్నారు. ఈ పథకం ద్వారా స్టేషన్‌లోనే సమావేశ మందిరాలు, స్టేషన్‌కు ఇరువైపులా అప్రోచ్ రోడ్లు, పార్కింగ్ ఏరియా పాదచారులకు ప్రత్యేక దారి, ల్యాండ్ స్కేటింగ్ ఆధునిక లైటింగ్ వేగవంతమైన వైఫై సేవలకు 5జి టవర్లు వంటివి అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉండే ఎస్ఎస్‌జీ 1-4, ఎస్‌జీ 1-2 కేటగిరి స్టేషన్లలో ఎస్కలేటర్లు ఏర్పాటవుతాయన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్ చైర్లు ప్రత్యేక మార్గాలు ఇతర సదుపాయాలు వెయిటింగ్ హాల్స్ వాటికి అనుబంధంగా కేఫటేరియా వంటివి ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో సమస్యల పరిష్కారానికి పలుమార్లు వినతులు అందించామని గుర్తు చేశారు. మోడల్ స్టేషన్‌తో పాటు సూపర్ ఫాస్ట్ రైళ్లకు ప్రత్యేక హాల్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, ఏడీఈఆర్ఎం గుప్తా, స్టేషన్ మాస్టర్ మొదలవలస రవి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్‌తాపా, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ ఎల్.శివశంకర్ , మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ దుంపల శ్యామలరావు జేజే మోహనరావు, జేకే వెంకబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఇచ్ఛాపురం: స్థానిక రైల్వే స్టేషన్‌ని అమృత్ భారత్ స్టేషన్ పథకంలో అభివృద్ధి చేసేందుకు సోమవారం శ్రీకారం చుట్టారు. స్టేషన్ ఆవరణలో స్టేషన్ ఈ కార్యక్రమాన్ని ఈస్ట్‌కోస్టు రైల్వే చీఫ్ ఇంజినీర్ అధికారి (సీఈ) చంద్రమోన్ షక్రి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య, ఈస్ట్‌కోస్ట్ రైల్వే అసిస్టెంట్ ఇంజనీర్ రస్మిరంజాన్ దాస్ పాల్గొన్నారు.

నౌపడలో..

టెక్కలి: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా టెక్కలి మండలం నౌపడ రైల్వే స్టేషన్‌లో సుమారు రూ.19 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధాని మోదీ సోమవారం వర్చువల్‌గా కార్యక్రమం నిర్వహించగా ఎమ్మెల్సీ నర్తు రామారావు, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, రైల్వే చీఫ్ ఇంజినీర్ కన్‌స్ట్రక్షన్ రామ్‌సింగ్, సీనియర్ డివిజన్ ఇంజినీర్ బ్రిడ్జ్ ఎస్.సత్యనారాయణ, ఏసీఎం జె.బి.కిరో, సిగ్నల్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఏడీఈ బి.కన్నబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

దూసిలో..


వర్చువల్ విధానంలో దూసి రైల్వే ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

ఆమదాలవలస రూరల్: దూసి రైల్వేస్టేషన్‌కు ప్రత్యేక చరిత్ర ఉందని రైల్వే కన్సల్టేటివ్ మెంబర్ (ఎస్‌సీసీ) సనపల నర్సింగరావు అన్నారు. మండలంలో దూసి రైల్వేస్టేషన్ వద్ద నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు ప్రధాని నరేంద్రమోదీ సోమవారం వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి నర్సింగరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఒకప్పుడు మహాత్ముడు ఈ స్టేషన్‌లో దిగారని ఆయన గుర్తు చేశారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా రాగోలు నుంచి తొగరాం వెళ్లే అర్‌అండ్‌బీ రహదారికి అనుకూలంగా రైల్వేగేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే ట్రాఫిక్ సమస్యకు తెరపడుతుందన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ చంద్రశేఖర సాహు



అమో ఆస్పత్రుల ప్రారంభం

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి (డీహెచ్‌హెచ్), చంద్రగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 5టీలో భాగంగా వివిధ వార్డులు, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వర్చువల్‌గా సోమవారం ప్రారంభించారు. స్థానికంగా శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ చంద్రశేఖర సాహు హాజరయ్యారు. పర్లాకిమిడి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.5,68,81,000 రిజిస్ట్రేషన్ కౌంటర్, అవుట్ పేషెంట్ వార్డు, చంద్రగిరి (మోహన) సీహెచ్‌సీలో వివిధ పేషెంట్ వార్డులు ప్రారంభించారు. మొత్తంగా రాష్ట్రంలో 66 ఆస్పత్రులు, సువర్ణపూర్‌లో 300 పడకల జిల్లా కేంద్ర ఆస్పత్రి, జర్సుగుడలో 100 పడకల బీఎంఆర్‌సీ ఆస్పత్రులను ప్రజలకు అంకితం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, సీడీఎంవో డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో, మున్సిపల్ చైర్మన్ నిర్మలా శెఠి, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు గాయాలు


గాయాలతో పార్వతి


గాయాలతో చికిత్స పొందుతున్న జితేంద్ర


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమీపంలో ధమన్‌జొడి నుంచి జాజ్‌పూర్‌కు కారులో వెళ్తున్న దంపతులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో కారులోని భార్యభర్తలకు తీవ్రగాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం పద్మపూర్ పీహెచ్‌సీకి తరలించారు. ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. ధమన్‌జొడికి చెందిన జితేంద్ర హస్త (32), అతని భార్య పార్వతీ (26), ఎనిమిదేళ్ల కొడుకు ఆర్యన్‌లు కలిసి ఒక కారులో జాజ్‌పూర్ వెళ్తున్నారు. ఆదివారం రాత్రి జిల్లాలోని పద్మపూర్ సమితి ముచికిపాడొరొ కూడలికి చేరుకునేసరికి ఎదురుగా వస్తున్న ఒక లారీని అదుపుతప్పి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కారు ముందరి భాగం పూర్తిగా దెబ్బతింది. కుమారుడు ఆర్యన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకొని అంబులెన్స్ సాయంతో క్షతగాత్రులను చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి కుప్పలు దగ్ధం

టెక్కలి రూరల్: మండలంలోని సీతాపురం గ్రామంలో గల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న గడ్డికుప్పలు సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. సీతాపురం గ్రామానికి చెందిన కోనారి నరసయ్య తిర్లంగి గ్రామానికి చెందిన సారిపల్లి అప్పయ్య, లఖినేని నారాయణరావు, మార్పు కామేష్‌లకు చెందిన సుమారు 5గడ్డి కుప్పల నుంచి సోమవారం సాయంత్రం ఒక్కసారి మంటలు రావడం స్థానికులు గుర్తించారు. యజమానులకు సమాచారం అందించేలోపు మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నికి ఆహుతైన గడ్డిని పశువుల మేత కోసం కొని తెచ్చామని, దాని విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని బాధిత రైతులు వాపోయారు. అయితే పాఠశాల సమీపంలో మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు.


గడ్డికుప్పల నుంచి చెలరేగుతున్న మంటలు.

పట్టపగలే దొంగతనం

కాశీబుగ్గ: పట్టపగలు ఓ ఇంట్లో దొంగలు చొరబడి దోచుకున్న సంఘటన ఆదివారం పలాసలో సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 12వవార్డు పోతనపల్లి వారి వీధిలో ఆదివారం మధ్యాహ్నం దొంగలు పడ్డారు. కాశీబుగ్గ డీఎ స్పీ కార్యాలయం వెనుకవీధిలో ఉన్న కొత్తకోట రామ, కొత్తకోట లక్ష్మిప్రణవిలకు చెందిన పదిహేను తులాల బంగారం, మూడు కిలోల వెండి అపహరించినట్లు పోలీసులకు తెలియజేశారు. న్యూకాలనీలో టిఫిన్‌షాప్ నడుపుతున్న కుటుంబ సభ్యులు మధ్యాహ్నం ఓ శుభ కార్యానికి వెళ్లారు. దీన్ని అదనుగా తీసుకున్న దొంగలు ఇంటితాళాలు పగలుగొట్టి లోపలకు జొరబడి బంగారం, వెండితో పాటు చిట్‌ఫండ్‌లో పాడిన నగదు సైతం దొంగిలించారని బాధితులు పోలీసులకు తెలిపారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఇంటికి వచ్చి చూసేసరికి బీరువా పగలు గొట్టి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీమ్ కూడా ఆధారాలు సేకరించింది. కాశీబుగ్గ పోలీసుస్టేషన్ వెనుకనే సంఘటన జరగడంతో కాశీబుగ్గ సీఐ విజయానంద పూర్తి స్థాయి విచారణ చేపట్టి నిందుతుల కోసం గాలిస్తున్నారు.


మంచంపై వెండిబిందెతో పాటు చెల్లా చెదురుగా వస్తువులు

‘క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి’


క్రీడాకారులకు బహుతులు అందిస్తున్న రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు,సర్పంచ్ బత్తిని స్పృజన లక్ష్మినారాయణ

వజ్రపుకొత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడలకు పెద్ద పీట వేస్తోందని, క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభ కనబర్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆకాంక్షించారు. మండలంలో గల పెదవంక- బాతుపురంలో గత మూడు రోజులుగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

ఈ పోటీల్లో 28 జట్లు పాల్గొనగా సచిన్ స్పోర్ట్స్ (శ్రీకాకుళం) జట్టు విజేతగా నిలిచింది. యువతరం సేవా సమితి (పూండి) జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. తృతీయ స్థానంలో బాతుపురం, చతుర్థి స్థానంలో కంచిలి జట్లు నిలిచాయి. విజేతలకు షీల్డ్‌లతో పాటు రూ.15 వేలు, రూ. 10 వేలు, రూ.7500, రూ.5 వేల బహుమతులను మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, స్థానిక సర్పంచ్ బత్తిని స్పృజన చేతులమీదుగా అందజేశారు.

క్లుప్తంగా

నేడు పోలమాంబ ఆరవ జాతర



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆరవ జాతర మంగళ వారం జరగనుంది. జాతరకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు అవసరమైన లడ్డు, పులిహోర ప్రసాదాలను తయారు చేయించారు. జాతరకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా సీఐ జి.బాలకృష్ణ, ఎస్సై నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

డైట్ ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ



డైట్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పగడాలమ్మ

నెల్లిమర్ల: నెల్లిమర్ల డైట్ ప్రిన్సిపాల్‌గా జి.పగడాలమ్మ సోమవారం బాధ్యతలు స్వీరించారు. పార్వతీపురం డీఈఓ(ఎఫ్ఏసీ)గా పనిచేస్తూ, ఇక్కడ రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా ఆమె కొనసాగుతారు. బాధ్యతలు స్వీరించిన పాదాలమ్మను సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌టి నాయుడు, డైట్ లెక్చరర్స్ యు.మాణిక్యాల నాయుడు, జీవీఎస్ నాగేశ్వరరావు, డి ఈశ్వర రావు, ఎం.రామకృష్ణ, కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: అరుణాచల ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో వివిధ విభాగాల్లో పతకాలు సాధించిన స్థానిక సత్య డిగ్రీ, పీజీ కళాశాల క్రీడాకారులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ మేరకు కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విజేతలు ఎస్.పల్లవి(64కేజీల విభాగంలో రజత పతకం), సీహెచ్ శ్రీలక్ష్మి (81 కేజీల విభాగంలో బంగారు పతకం)లను, వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ చల్లా రామును కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వీసాయిదేవమణి, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎం.ఉదయ్‌కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూర్యనాయుడు తదితరులు అభినందించారు.

80 లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని కొప్పెరడంగ్ ప్రాంతంలో 80 లీటర్ల సారా పట్టుకుని సీజ్ చేసినట్టు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. కుడ్డపల్లికి వెళ్తుండగా మార్గమధ్యంలో సారా బట్టీలపై దాడులు చేసి సారా తయారీకి వినియోగించనున్న 1600 లీటర్ల పులిసిన బెల్లం ఊటలు కూడా ధ్వంసం చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సోమేష్ మృతదేహం

పూసపాటిరేగ: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి రోడ్డుప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం మండాకురిటి గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సోమేష్(65) పూసపాటిరేగలో జరిగిన తెలగసామాజిక వర్గం మీటింగుకు వచ్చి తిరిగి వెళ్తున్నప్పుడు జాతీయరహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి..

గంట్యాడ, బొండపల్లి: బొండపల్లి మండలంలోని గ్రహపతి అగ్రహారానికి చెందిన చప్ప కృష్ణ (45) విద్యుత్ షాక్ కొట్టి మృతి చెందాడు. గంట్యాడ మండలంలోని పెదమజ్జిపాలెం గ్రామ సమీపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు వెళ్లిన కృష్ణకు విద్యుత్ వైర్లు పొరపాటున తగలడంతో షాక్ కొట్టింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు గంట్యాడ ఎస్సై సురేంద్ర నాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత పాఠశాలల స్థాయి పెంపు

- అందుబాటులోకి ఇంటర్మీడియట్ కోర్సులు
- కో ఎడ్యుకేషన్ అమలుకు చర్యలు



కో-ఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్ అమలులో ఉన్న ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

విజయనగరం అర్బన్: పేద ప్రజలకు ఇంటర్‌మీడియట్ కోర్సులను అందుబాటులో ఉంచాలనే లక్ష్యం అమలులో భాగంగా ప్రభుత్వం మరో అడుగు వేసింది. రెండేళ్ల క్రితం జిల్లాలో ఒక ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా స్థాయి పెంచి అమలు చేసింది. రెండేళ్ల తరువాత తాజాగా మరో ఏడు పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా స్థాయి పెంచి విస్తరించింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ నంబర్ 14 విడుదల చేసి రానున్న విద్యాసంవత్సరానికి ఆయా స్కూళ్లలో ఇంటర్‌మీడియట్ కోర్సులను ప్రవేశ పెట్టాలని ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం జూనియర్ ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్న మండలాలలో కాకుండా మిగిలిన మండలాల్లో ఒక్కో ఉన్నత పాఠశాలలో ఇంటర్‌మీడియట్ కోర్సులను ప్రవేశ పెట్టి ఆయా ఉన్నతపాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా స్థాయి పెంచింది. ఇప్పటికే జిల్లాలోని అన్ని కేజీబీవీలలో ఇంటర్‌మీడియట్ కోర్సులు ప్రవేశ పెట్టారు. అయితే అవి పూర్తిగా బాలికలకు మాత్రమే కావడం వల్ల వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. విధిగా కో-ఎడ్యుకేషన్ కళాశాలలుండాలని కేజీబీవీ లున్నప్పటికీ ఆ మండలంలో జూనియర్ కళాశాల లేకపోతే అక్కడ హైస్కూల్ ప్లస్ ఏర్పాటు చేశారు. దీంతో అన్ని మండలాల్లో కో-ఎడ్యుకేషన్ ఇంటర్‌మీడియట్ ఉన్నట్లయింది. జిల్లాలోని 27 మండలాల్లో 17 మండలాల్లో మాత్రమే కో-ఎడ్యుకేషన్ ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. రాజాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండడంలో లెక్కప్రకారం 16 మండలాలకే జూనియర్ కళాశాలలు ఉన్నాయి. దీంతో ఇంకా 12 మండలాల్లో ఇంటర్‌మీడియట్ కోర్సుల కళాశాలలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ మండలాల్లో ప్రత్యామ్నాయంగా హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేయాలని భావించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే రెండేళ్ల క్రితం తొలుత ఎస్‌కోట మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా స్థాయి పెంచారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమలు



జిల్లాలో 7 ఉన్నత పాఠశాలలకు కో-ఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్‌గా స్థాయి పెరగనుంది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ 14ను విడుదల చేసింది. 2024-25 జూన్ 1 నుంచి ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహించనున్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు కేటాయించారు. దీనికి సంబంధించిన ప్రవేశ ప్రకటన త్వరలో వస్తోంది. – ఎస్.ప్రేమకుమార్, డీఈఓ

స్థాయి పెరగనున్న స్కూళ్లు ఇవే

జిల్లాలో ఇంటర్‌మీడియట్ కోర్సులను ఏర్పాటు చేసే హైస్కూల్ ప్లస్‌లుగా ఏడు ఉన్నత పాఠశాలలను మారుస్తారు. వాటిలో బొబ్బిలి మండలంలోని పిరిడి, బొండపల్లి, గరివిడి మండలంలోని కోనూరు, గుర్ల మండలంలోని తెట్టంగి, జామి, రామభద్రపురం, ఆర్‌ఆమదాల వలస మండంలలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

ఇంటి పట్టాతో పూర్తి హక్కు



మహిళలకు సొంతింటి పూర్తిహక్కు పత్రాలను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- పేదవాడి సొంతింటి కల సాకారమే సీఎం ధ్యేయం
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా మంజూరు చేయడమే కాకుండా పూర్తి హక్కు పత్రాలను కూడా అందించడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పునరుద్ఘాటించారు. ఈ మేరకు విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను సోమవారం అందజేశారు.

నగర పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ఇప్పటికే గుంకలాం, జమ్ము, కొండకరకాం, సారిక ప్రాంతాల్లో మొత్తం 19,601 మందికి ఇళ్లపట్టాలను మంజూరు చేశారు. వాటిలో ఇప్పటివరకూ 12వేల తొమ్మిది మంది లబ్ధిదారుల పట్టాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను లబ్ధిదారులకు అందించడంతో మహిళల్లో ఆనందం వ్యక్తమైంది.

ఈ ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే

ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల రూపంలో పేదలందరికీ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించి అమలుచేశారన్నారు. అంతేకాకుండా ఆయా స్థలాలకు పూర్తి హక్కులను కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి, అందజేయడం సరికొత్త విధానమన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు రూ.8,668 ఖర్చు కాగా, లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా ప్రక్రియను పూర్తిచేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, సహాయ కమిషనర్ తిరుమలరావు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, హౌసింగ్ కమిటీ సభ్యులు కంటుభుక్త తవిటిరాజు, మారోజు శ్రీనివాసరావు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ఎల్.కోట విజేత

- క్రీడల్లో రాణిస్తే ఉజ్వలభవిష్యత్తు
- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



రసవత్తరంగా సాగుతున్న ఎల్.కోట-కొత్తవలస జట్ల మధ్య పోరు



ఎల్.కోట జట్టుకు ట్రోఫీ, చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తదితరులు

కొత్తవలస: యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆలాగే క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలని అప్పుడే స్నేహభావం పెరిగి పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు కొత్తవలస మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులుగా శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ కర్మాగారం ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 16 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మొదటి స్థానంలో లక్కవరపుకోట జట్టు, ద్వితీయ స్థానంలో కొత్తవలస, తృతీయ స్థానంలో విజయనగరం, నాల్గవ స్థానంలో జామి జట్లు నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,శారద కర్మాగారం సీనియర్ జనరల్ మేనేజర్ ప్రభాత్‌మోహన్‌లు విజేత జట్లకు వరుసగా రూ.1.25లక్షలు, రూ.60వేలు, రూ.30వేలు, రూ.25వేలు చొప్పున నగదు బహుమతులు, ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి జట్టుకు ఒక నెట్, రెండుబాల్స్ అందించారు. కార్యక్రమంలో కర్మాగరం ప్రతినిధులు సన్యాసిరావు, జి.శంకరరావు, జాతీయ శిక్షకుడు గవర సూరిబాబు, చీఫ్ కోచ్‌లు ఎం,కృష్ణంరాజు, జాతీయ రిఫరీ ఎల్.జి.ఎన్.కుమార్, పీడీలు బాల, పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం

- ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



పార్వతీపురం: వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



విజయనగరం అర్బన్: అర్జీలను స్వీకరిస్తున్న సహాయ కలెక్టర్ త్రివినాగ్, డీఆర్‌ఓ అనిత



విజయనగరం క్రైమ్: ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీవో కల్పనాకుమారి

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మండల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి. కేశవ నాయుడు, ఆర్‌డీఓ కె.హేమలతతో కలిసి ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 140 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, డీపీఓ బి.సత్యనారాయణ, డీఈఓ పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 35 వినతులు

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 35 వినతులు వచ్చాయి. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, డీడీ అన్నదొర, డిప్యూటీ ఈవో లిల్లీరాణి తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని సకాలంలో పరిష్కరించాలని డీఆర్‌ఓ అనిత ఆదేశించారు. ఆయా ప్రభుత్వ శాఖలు తమకు సంబంధించి ఆన్‌లైన్‌లో పంపిన వినతులను పరిశీలించి వాటిపై స్పందించాలని సూచించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ త్రివినాగ్, కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సుమబాల, మురళీకృష్ణ, ఆర్‌డీఓ సూర్యకళతో కలిసి డీఆర్‌ఓ ఎస్‌డీఅనిత వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 175 వినతులు అందాయి.

స్పందన ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు అందజేసే బాధితులకు తక్షణ న్యాయం చేకూర్చే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 41 ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ఎస్బీ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సై గణేష్, ఎస్సై ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఆశల సమస్యల పట్ల చర్యలు

- డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్: ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపడతామని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ఆశ కార్యకర్తల విధి నిర్వహణ, సమస్యలపై ఆశ నోడల్ అధికారులతో గ్రీవెన్స్ సమావేశాన్ని డీఎంహెచ్‌ఓ అధ్యక్షతన ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీల వారీగా విధులకు సంబంధించి ఆశ కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలోకి వచ్చే ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ, ఆశ కార్యకర్తల జాబ్ చార్ట్ పరిధిలో లేని విధులు, ఆస్పత్రిలో రాత్రిపూట విధులకు, మందులకిట్లు, వ్యారియర్స్ తీసుకుని వెళ్లడంలో ఇబ్బందులను ఆశ కార్యకర్తలు నివేదించారు. రోగులను రిఫరల్ ఆస్పత్రులకు తీసుకు వెళ్లేటప్పుడు ఆశ కార్యకర్తలకు అక్కడ నిరీక్షణ గది ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తగు కార్యాచరణ చేపడతామని డీఎంహెచ్‌ఓ అన్నారు. ఆశ కార్యకర్తలకు వారి జాబ్‌చార్ట్ పరిధిలో లేని విధులకు తావివ్వకుండా తగు మార్గ నిర్దేశం చేయాలని నోడల్ అధికారులకు డీఎంహెచ్‌ఓ సూచించారు.

సినీఫక్కీలో దోపిడీ



బాధితుడు శ్రీరామ్మూర్తి నుంచి వివరాలను సేకరిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

గరుగుబిల్లి: దొంగలు రోజుకో కొత్త మార్గంలో సినీ ఫక్కీలో చోరీలు, దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో గరుగుబిల్లి మండలంలోని సంతోషపురం పంచాయతీ ఖడ్గవలస జంక్షన్‌లో రైస్‌మిల్లు యజమాని కమిడి శ్రీరామూర్తినాయుడు ఇంట్లో సోమవారం వేకువ జామున దోపిడీ జరిగింది. దొంగతనానికి వచ్చిన వారు ఇంట్లో ఉన్న భార్యాభర్తలను తాళ్లతో కట్టేసి ఇంట్లోని బంగారం వస్తువులు, నగదు వారి కళ్లముందే చోరీ చేసి దర్జాగా వెళ్లిపోయారు. దొంగతనం బయట పడకుండా ఉండేలా ఇంట్లో సీసీ కెమెరాకు అమర్చిన హార్డ్ డిస్క్‌ను ఎత్తుకుపోయారు. వేకువ జామున నీరు లేదని మోటార్ వేసేందుకు ఇంటి వారు బయటకు రాగా అప్పటికే కాపుకాసి ఉన్న దొంగలు ఇంట్లో చొరబడి భర్యాభర్తలపై దాడి చేసి వారి కాళ్లూచేతులు కట్టేసి దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో సుమారు 80 తులాల బంగారు ఆభరణాలు, నగదు పోయాయి. బాధితుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి పాలకొండ డీఎస్పీ జీవీ.కృష్ణారావు, చినమేరంగి సీఐ మురళీధర్, స్థానిక ఎస్సై అమ్మాన్ రావు చేరుకుని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. వేలిముద్రలు, ఇతర ఆనవాళ్లను క్లూస్ టీమ్ పరిశీలిస్తోంది.

రూ.14.76 కోట్లతో..

పార్వతీపురం రైల్వే స్టేషనఆధునికీకరణ

- కలెక్టర్ నిషాంత్ కుమార్



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా రూ.41వేల కోట్లతో చేపట్టనున్న 554 రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయగా, 1500 రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేశారు. ఇందులో భాగంగా రూ.14.76 కోట్లతో పార్వతీపురం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు జరగుతున్నాయి. విశాఖపట్నం డివిజన్ పరిధిలోని పార్వతీపురం, సింహాచలం, కొత్తవలస, చీపురుపల్లి, శ్రీకాకుళం, నౌపడ, పర్లాకిమిడి, బొబ్బిలి, రాయగడ, కోరాపుట్, అరకు, జైపూర్ రేల్వే స్టేషన్లు ఆధునీకరించనున్నారు. పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో భవనాల ఆధునికీకరణ, వెయిటింగ్ హాల్స్, కెఫెటేరియా, స్థానిక ఉత్పత్తుల విక్రయానికి స్టాల్, ఫ్లాట్ ఫామ్స్, అప్రోచ్ రోడ్డు, పార్కింగ్, పాదచారులకు దారి, లాండ్ స్కేపింగ్, ఆధునిక లైటింగ్ తదితర పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్ కుమార్, రైల్వే అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పార్వతీపురం రైల్వే స్టేషన్ పనులు చరిత్రాత్మకం అన్నారు. ఈ స్టేషన్ మీదుగా 22 ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తాయని వెల్లడించారు. అమృత్‌భారత్ పథకంపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, రైల్వే చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.కె.పి.గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ సంజయ్‌కుమార్ మీనా, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ పి.రవికిరణ్, స్టేషన్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు, వివిధ పార్టీల ప్రతినిధులు డి.జగదీష్, బి.విజయచంద్ర, శ్రీనివాసరావు, నిమ్మక జయరాజు, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కోర్సులతో నైపుణ్యం మెరుగు



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య

- జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య
- జాతీయస్థాయి సాంకేతిక సింపోజియం ప్రారంభం

విజయనగరం అర్బన్: పరిశోధన రంగంలో వస్తున్న ఆధునికతకు అనువైన నూతన కోర్సులను నేర్చుకుని నైపుణ్యం మెరుగుపరచుకోవాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సి వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. ఈ మేరకు స్థానిక ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించే జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం సదస్సును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య స్థాయిలోనే సంబంధిత విద్యతోపాటు ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. అందుకు సంబంధించిన ఇలాంటి సదస్సులలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖ స్టీల్ ప్లాంట్ జీఎం (డీఈఅండ్‌ఈఏ) కె.వాణిశ్రీ మాట్లాడుతూ రానున్న సాంకేతిక అభివృద్ధికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) కీలకంగా నిలుస్తుందన్నారు. అందుకు అవసరమైన మానవ శక్తి డిమాండ్‌ను నేటి యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వార్షిక సావనీర్‌ను వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, సదస్సు కన్వీనర్ డాక్టర్ వీఎస్.వకుళ, ఫాకల్టీ కోఆర్డినేటర్స్ పి.శ్రీనివాసరెడ్డి, టి.శిరీష, విద్యార్థి కో ఆర్డినేటర్ వి.దయాకర్, రాము, డి.విజయశ్రీ, పి.కల్యాణి, వివిధ కళాశాలల నుంచి 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మార్చి 3న పల్స్‌పోలియో కార్యక్రమం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్

పార్వతీపురం: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మార్చి 3వ తేదీన నిర్వహిస్తామని ఇన్‌చార్జి జేసీ సి.విష్ణు చరణ్ తెలిపారు. పల్స్‌పోలియో నిర్వహణపై కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఐదేళ్లలోపు వయస్సున్న పిల్లలు 98,991 మందికి పోలియో చుక్కలు వేయాలన్నది లక్ష్యమన్నారు. దీనికోసం 905 బూత్‌లు ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. 19 ట్రాన్సిట్ బూత్‌లు, 42 మొబైల్ బృందాలు పనిచేస్తాయని, 93 మంది రూట్ సూపర్‌వైజర్లు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారన్నారు. ఇటుకల తయారీ ప్రాంతంలో 132 మంది పిల్లలు, మురికివాడల్లో ఉన్న 1768 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడంపై ప్రత్యేక శ్రద్ధచూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పోలియో పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, ఆర్డీఓ కె.హేమలత, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త కె.అప్పారావు, డీఐఓ ఎం.నారాయణ రావు, డీటీఓ సి.మల్లికార్జునరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ఎం.ఎస్.రాణి, తదితరులు పాల్గొన్నారు.